నడుస్తున్నవాడల్లా ఒక్కసారి ఎదురుగా గోడ మీద - దీపాల వెలుగులో స్పష్టంగా పెద్దవిగా కనిపిస్తున్న ఆ మాటలు చదివాడు.

"వర్కింజ్ వర్షిప్ (శ్రమయే ప్రార్థన)"

అతని కనిపించింది... ఆ పల్చని ప్లాస్టిక్ గ్లాసు - పరిశుభ్రతకీ, సౌకర్యానికే కాదు శ్రమజీవన సూత్రానికి కూడా నిలయమే!

✡ ✡ ✡ ✡

# కారాటు

"సార్....."

పేపరు చదువుకుంటున్న శ్రీమంత్ తలతిప్పి అటు చూశాడు.

అహమ్మద్.

నిన్నరాత్రి వరకూ కారు డ్రయివర్.

"మళ్ళీ ఎందుకొచ్చావ్?" కొంచెం కోపంగా చూశాడు శ్రీమంత్.

"క్షమించండి. నేను - మళ్ళీ ఉద్యోగమిమ్మని అడగడానికి మాత్రం రాలేదు-" అన్నాడతను వినయంగానే.

"మరెందుకు వచ్చావ్? నీకు రావలసిన బకాయంతా నిన్ననే యిచ్చెయ్య లేదూ?"

"ఇచ్చేశారు. నిజానికి... నాకు రావలసిన దానికంటె కొద్దోగొప్పో ఎక్కువే యిచ్చారు."

"ఇంకేం?"

"నిన్న రాత్రి జరిగినది..." గొణిగాడహ్మద్.

శ్రీమంత్ చిరాకుగా సోఫాలో వెనక్కి చేరబడ్డాడు - చేదు విషయాన్ని విధి లేక జ్ఞాపకం తెచ్చుకుంటున్నవాడిలా.

నిన్న సాయంత్రం..

కొత్త కారులో...

ఒక వ్యాపారపు పని నిమిత్తం నరసీపట్నం బయలుదేరాడు. కలప కాంట్రాక్టు... సఫలమయితే ఐదారు లక్షల పైచిలుకు లాభం. మంచి ముహూర్తం కుదిరి... కారు బయలుదేరే సరికి... ఆరు దాటింది. చీకటి పడబోతోంది.

రోడ్డు ఏమీ బాగులేదు. దేశ పరిస్థితి లాగానే. ఆర్థిక అసమానతలలా రోడ్డు గోతులమయం.

అయినా కారు వేగం గానూ మెత్తగానే పరుగెడుతోంది.

ఖరీదయిన ఎ.సి. కారు. పైగా కొత్తది. ఎలాటి కుదుపులనయినా సుఖాలుగా మార్చగలిగే అధునిక కుషన్ సీట్లు.కనుక... వేగమూ కుదుపులూ తెలియనివ్వకుండా – నీటి మీద పడవలా నిశ్శబ్దంగానూ మెత్తగానూ జారిపోతూంది అంత దారుణమయిన రోడ్ల మీద కూడా.

వెనుకకి చేరబడి...

కళ్లు మూసుకుని...

కంట్రాక్టు గురించీ... రాబోయే లాభాల గురించీ సుఖంగా ఆలోచించుకుంటూ... సిగరెట్ కాల్చుకుంటూ... ప్రయాణాన్ని ఆనందంగా చేసుకుంటున్నాడు శ్రీమంత్. ఎ.సి. అక్కరలేకుండానే చల్లగా ఉంది, చలికాలం ప్రవేశించే రోజులు కావడాన. చలికాలం రాబోతూందని సూర్యుడు కొంచెం ముందుగా అస్తమించేశాడు. చీకటి తొందరపడుతోంది భూమ్మీద దిగడానికి.

కారు దీపాలు వేశాడు డ్రయివర్.

అనకాపల్లి దాటింది కారు.

కిటికీల లోంచి అటూ యిటూ చూస్తున్నాడు శ్రీమంత్ – కలలూ ఊహలూ కూడావిసుగు తెప్పించినప్పుడు – విరామంగానూ విశ్రాంతిగానూ.

చీకటి వేగంగా చిక్కబడుతోంది. కారు దీపాల కాంతి పాములా పరుగెడుతోంది ముందుకు.

అటూ ఇటూ అక్కడా అక్కడా చిన్న చిన్న పల్లెలు.

దీపాలు కూడా ఉన్నట్లు లేవా గుడిసెలలో.

వాళ్ళు చాలా పేదవారై ఉంటారు. కడుపుకి తిండే దొరకని వారికి కంటికి కాంతా?

అతని మనసు పేదల పట్ల జాలితో ప్లావితమైంది.

శ్రీమంత్‌ది జాలిగుండె. ఐశ్వర్యవంతుడయినా అతనూ మనిషే. అతనిలోనూ మానవత్వముంది.అతను బీదవారి కోసం జాలిపడుతూ ఉంటాడు – అలాటి సందర్భమూ సమయమూ వొస్తే.

కలలు లేని నిద్రలా... అటూయిటూ ఊళ్ళూ యిళ్ళూ లేని రోడ్డు. చిక్కబడిన చీకటి. వేగంగా జారిపోతున్న కారు.

కళ్ళు మూసుకుని – ఆలోచించుకుంటున్నాడు శ్రీమంత్.

ఒక్కసారి – కీచుమంటూ కారు శబ్దం.

"అమ్మా!" అన్న ఆర్తనాదం వెనుకో తెలియనంతగా కలగలసిపోయి. కారాగిపోయింది.

శ్రీమంత్ త్రుళ్ళిపడి – ఆగిన కారులోంచి కిందికి దిగాడు.

అప్పటికే–

బిల బిల మంటూ మనుషులు.

కర్రలు పట్టుకుని కొందరూ,

దీపాలు పట్టుకుని కొందరూ

"కుర్రాడు సచ్చిపోనాడేమో..."

కారు దీపాల కాంతిలో...

ఒక కుర్రాడిని ఎవరో మోసుకునెళ్తున్న దృశ్యం.

శ్రీమంత్ వాణికిపోతున్నాడు.

ఎనిమిదీ - పదేళ్ళ కుర్రాడు.

తన కారు క్రింద పడినట్లుంది.

ఎవరో యిద్దరు పెద్దవాళ్ళు వాడి నెత్తుకుని... రోడ్డు పక్క గుడిశెలవేపుకి మోసుకుపోతున్నారు.

కారు చుట్టూ... దానిని కదలనివ్వకుండా అష్ట దిగ్బంధనం చేయడమే తమ ఉద్దేశమన్నట్లు... పట్టు చుట్టూ తేనెటీగల్లా... బెల్లం ముక్క మీద యీగల్లా, ముసురుకుంటున్న - మురికి మనుషులు. వారి నుంచి - కల్లు వాసనా, సారా కంపూ... గుప్పుమంటున్నాయి.

దెబ్బతిన్న కుర్రవాడి అరుపులు...

"అమ్మో...బాబో..."

"కారోళ్ళు కన్నూ మిన్నూ కాన్రు. గుంటడు బతుకుతాడో బతకడో..."

కార్ల మీదా... కలవారి మీదా కఠినమయిన శాపాలూ, కారుకూతలూ, స్త్రీ పురుష విభేదం లేకుండా నోటికి వొచ్చినట్లు అంటున్నారు. నోరు పారేసుకుంటున్నారు. ఆవేశపడుతున్నారు. ఉద్రేకపడిపోతున్నారు.

శ్రీమంత్ ఒక్కసారి కారు ముందుకు నడిచి - "డ్రయివర్ ! నువ్వు మాత్రం కారు దిగకు. పరిస్థితి బాగులేదు. నేను చూసుకుంటానులే..." అని... ఆ మనుషుల కెదురుగా వొచ్చి నిలుచున్నాడు. అతనికి తానెక్కడున్నాడో కొంచం అర్థం అయింది.

ఇదొక చిత్రమయిన ప్రదేశం. ఇటూఅటూ ఎక్కడ చూసినా పది కిలోమీటర్ల వరకూ చెప్పుకోదగిన పల్లెటూరయినా లేదు, పట్నం మాటటుంచి. కనుక... పోలీసు సహాయం లభించటం అసాధ్యమే. బంజరు భూములలాటి యీ కొండ నేలలో వీళ్ళు గుడిశెలు వేసుకుని గూడెంలా ఏర్పడినట్లుంది. ఇక్కడేం జరిగినా ఎవరికీ తెలియదు. నేషనల్ హైవే కాదుకానీ ప్రయాణ సాధనాలు మాత్రం రాకపోకలు జరుపుతూంటాయి. కాని... ఏ లారీయో కారో వొచ్చినా వాళ్ళు తనని రక్షిస్తారనే ఆశేమీ లేదు. మెల్లగా... జాగ్రత్తగా... తెలివిగా... యీ పరిస్థితి నుంచి తనే బయటపడాలి.

"చూడండి... పొరపాటు జరిగిన మాట నిజమే. నేనంగీకరిస్తున్నాను" అన్నాడు మెల్లగా.

"పొరపాటేటి? పెద్ద గోరం జరిగిపోతే..."

"నిజమే. ప్రమాదమే జరిగింది... జరిగిపోయిన దానికెవరూ ఏమీ చేయలేరు. కాని... దానిని సరిదిద్దేందుకు... నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. మీరేం చెయ్యమన్నా చేస్తాను..."

"ఏటి సేత్తారు? పందులాటి పసోణ్ని కారెట్టి గుద్దించేసి?"

అంతలో ఏ గుడిసెల వేపు నుంచో ఎవరో పరుగెత్తుకొచ్చారు. బహుశా దెబ్బ తగిలిన కుర్రవాడిని మోసుకు వెళ్ళినవారిలో ఒకడయి వుంటాడనుకుంటూ...

"ప్రాణాపాయం లేదు కదా?" అని ఆత్రంగా అడిగాడు శ్రీమంత్.

దానికతను సూటిగా జవాబు చెప్పకుండా "కాలు పోయి కట్టె మిగిలితే మాత్రమేటి? అది మరీ నరకం మాలాటోళ్ళకి, కూసుని తినగలగడానికి మేమేమన్నా కలవాళ్ళమా, కార్ల వాళ్ళమా? కష్టపడి రెక్కవిరుచుకున్నా డొక్కలు నిండని కటికోళ్ళం. కాళ్ళేకపోతే కూడే నేదు మా బతుకులకి..." అన్నాడు విసురుగా.

"ప్రాణాపాయం లేకపోతే ఫరవాలేదు. చిన్న పిల్లడు. కచ్చితంగా కాలొస్తుంది. ఎంతడబ్బయినా మంచి హాస్పటల్లో చేర్పిస్తాను.." హామీ యిస్తున్నట్లే అన్నాడు శ్రీమంత్.

"మిమ్మల్నీ మీ కారునీ జూసి ఆ కరీదైన ఆస్పిటలోళ్లు చేర్చుకోనూ చేర్చుకుంటారు, మీరు చేర్పించనూ చేర్పిస్తారు. డబ్బయితే యిస్తారుకానీ అడి కాలొచ్చీ వరకూ కావలించు క్కూర్చోరు కదా? మీ పన్లూ ఎవ్వారాలూ మీవి. ఈ గుంటడి కోసం అవన్నీ సెడుపుకోరు కదా? మీర్నేకుండా మేమా ఆస్పిటల్లో కడుగెట్టబోతే గేటు దగ్గర గూర్ఖోడు మమ్మల్నీ మా మురికిగుడ్డలనీ మకిలి మనుషుల్నీ గజ్జి కుక్కల్ని తరిమినట్లు తరుముతాడు - మాలాటోళ్ళు లోపలికొస్తే ఆస్పిటోలు మాసిపోతదని... మలినమౌతదని..."

మా పుర్రాకులేవో మేం పడతాం కానీ ఓ పదేలిప్పించండి. ఏ గచ్చాకు వొయిజ్యమో పుచ్చాకు వొయిజ్యమో చేయించుకుంటాం... మీరిచ్చిందాంట్లో ఏమన్నా మిగిల్తే ఆ గుంటడి పేర దాసుతాం."

పదివేలు!... గచ్చాకు పుచ్చాకు వైద్యం!

"మాకు... మా చీకటోళ్ళ గూడానికి పోలీసులూ పట్నం వొయిద్యమూ అచ్చిరావు". ఎవరికి తోచినమాట వారు చెబుతున్నారు. అంతలో...

ఓ స్త్రీ శోకాలు పెడుతూ వొచ్చింది. కోడుకా ! నా కొడుకా ! వర పుత్రుడివనుకున్నాంరా బిడ్డా! బిడ్డా! కాలు పోయి కుంటోడివైపోనావట్రా కొడుకా... కొడుకా... కారోడు నీ కాల్నిఏసినాడట్రా కొడుకా... కొడుకా... కారోడి కడుప్మాడి పోనూ... బతుకంతా ఎదరే ఉంది కదరా బిడ్డా... కాళ్ళునేకుండా బతుకెలా కడతేరుతాదిరో కొడుకా... బతుకంతా దేకురేనా బిడ్డా..."

అవిడ దెబ్బ తగిలిన కుర్రాడి తల్లిలా ఉంది. అవిడ శోకం మహదీనంగా ఉంది. అవిడ బాధ మహజాలిగా ఉంది. అవిడ తిట్లు కఠినంగా ఉన్నాయి. అవిడ శాపాలు ఘోరంగానూ తీవ్రంగానూ ఉన్నాయి. ఆమె దుఃఖం శ్రీమంత్‌కి హృదయవిదారంగా ఉంది.

"ఒల్లకోయే. ఎంతేడిస్తే మాత్రం కాలొస్తదేటి? బాబు డబ్బిస్తాడులే..."

"డబ్బులకి బిడ్డకి కాళ్లొస్తాయా? నాకు డబ్బొద్దు... నా కొడుక్కి కాల్దేప్పించమను..."

"అదయ్యేపనేటి? వొల్లకో... ఎళ్ళు... మేం ఎవ్వారం సెటిల్ జేస్తాంలే. పో..."

ఎవరో బలవంతంగా ఆమెను తీసుకుపోయారక్కడి నుంచి. ఆమెతోపాటు శోకమూ, శాపాలు, తిట్లు నిష్క్రమించేసరికి శ్రీమంత్‌కి కొంచం తేలిక పడ్డట్లనిపించింది.

"ఒక్కసారా కుర్రాణ్ణి పరిస్థితినీ చూసి..." ఏదో అనబోయాడు శ్రీమంత్.

"బాబూ... తమరు డాక్టరా?" అమాయకంగా అడిగాడెవరో. "ఐతే రండి"

"కాను..."

"మరి తమరు చూసేటి జేస్తారు?"

శ్రీమంత్ కేం చెప్పాలో తోచలేదు. మానవత్వం... విద్యుక్త ధర్మంలాంటి పెద్ద మాటలూ అలగా జనం ముందు వ్యర్థమై పోతాయేమో అన్నట్లు మూగబోయాడు.

"తమరా గుడిసెలో కొచ్చి... ఆ కుర్రాడిరిగిన కాల్నీ... రక్తమండలాన్నీ చూసి... ఆడి బాధ కేకలింటానంటే మాకేటీ అభ్యంతరం లేదు. మీరు తట్టుకోలేరేమో అనే, పొమ్మెండి. రండి. సంగతీ సందర్భమూ సూసే యివ్వండి సొమ్ము. ఇరిగిన కాలుకి సొంతంగా మీరే యిలువకట్టివ్వండి. కాని బాబూ... ఓ కాలి కరీదు కోటా? పదికోట్లా? మాలాటి కష్టజీవులకి కాళ్ళేతుల కరీదు బతుకు బాబూ... బతుకు. నిండు బతుకు రండి... దయ చేయండి... సొయంగా సూడండి..."

"అదే... ఆ గుడిసే..."

ఒక్కసారందరూ నిశ్శబ్దమైపోయారు. ఆ నిశ్శబ్దంలో... గుడిసెలోంచి... వినేవారు గుండెలు ద్రవించేలా... దెబ్బతిన్న కుర్రాడి బాధాపూరిత ఆర్తనాదాలు...

చటుక్కున మనసు మార్చుకున్నట్లు... "ఒద్దులే. నిజమే. నేను వొచ్చీ, చూసీ మాత్రం చేయగలిగేదేముంది? ఆ అబ్బాయికి నా క్షమాపణలూ... యీ డబ్బూ అందజేయండి. కాలు బాగు చేయించండి. కుర్రాడు తొందరగా కోలుకోవాలని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తాను..." అంటూ కారులోంచి బ్రీఫ్‌కేసు తీసి... పదివేలు వారి చేతిలో ఉంచాడు.

"మంచిది. బాబూ తమలాటోరికెన్ని పనులో! ఎల్లి... పన్జూసుకోండి"

బ్రతుకుజీవుడా అనుకున్నాడు శ్రీమంత్. తన కారు ఆ కుర్రాడి కాలు విరిచినందుకు ప్రతిగా పరిహారంగా వీళ్ళు తన కాలు విరిస్తే మాత్రం చేయగలిగేదేముంది తను? నిర్జనమయిన యీ ప్రదేశంలో వీరిది స్థానబలం. న్యాయబలం కూడా వారిదే.

తేనెపట్టుకి పొగపెట్టగా యీగలు చెదిరిపోయినట్లు వాళ్ళంతా రోడ్డువక్క గుడిసెల్లోకి మాయమైపోయారు. ఇప్పుడు రోడ్డుమీద వాళ్ళెవరూ లేరు.

"అహమ్మద్! స్టీరింగ్ నాకివ్వు"

"ఫరవాలేదు సర్. ప్రమాదానికి నేను షాకయిన మాట నిజమే కాని... యిప్పుడు తేరుకున్నాను సార్. డ్రయివ్ చెయ్యగలను సాబ్..."

అతని మాట వినిపించుకోకుండా స్టీరింగ్ తీసుకున్నాడు శ్రీమంత్. కారు కదిలింది.

"అదేమిటి సాబ్? వెనక్కి తిప్పారు?" ఆశ్చర్యంగా అడిగాడు అహమ్మద్.

జరిగిన ప్రమాదం అపశకునంలా అనిపించిందని చెప్పలేదు శ్రీమంత్. మౌనంగా వేగంగా కారు పోనిస్తూ... "కారు కండిషన్‌లోనే ఉందా? బ్రేక్స్...?"

"పర్‌ఫెక్ట్ కండిషన్ సర్... కొత్త కారూ.... ఫారిన్‌దీ..."

"సరే. నువ్వు? నువ్వు సరిగ్గానే ఉన్నావా?"

అవాక్కయ్యాడా ప్రశ్నకి అహమ్మద్. "నేను ఎక్స్‌పర్ట్‌ని మాటిని సర్. డ్రయివింగ్‌లో ఎన్నో బహుమతులు గెల్చుకున్నాను, సర్వీస్‌లో ఉండగా. డ్యూటీ ఉందంటే నేను తాగను సర్"

హఠాత్తుగా కాళాపాడు శ్రీమంత్.

"దిగు"

"దేనికి సర్?" అంటూనే కారు దిగాడు అతను.

"ఇది నీ జీతం, యీ నెలది... నువ్వు ఉద్యోగంలోంచి తొలగించబడ్డావు" అంటూ అతనివేపు కొంత డబ్బు విసిరి కారుని ముందు కురికించి వెళ్ళిపోయాడు శ్రీమంత్.

ఒక గెల వేశాక అరటిచెట్టు నరకబడుతుంది. అలాగే శ్రీమంత్ దగ్గర ఏ డ్రయివరేనా ఒక యాక్సిడెంటు చేసేవరకే. అతను యింటికి వొచ్చేశాడు.

"నేనే వొచ్చిందీ, మళ్ళీ వొచ్చిందీ... మిమ్మల్ని ఉద్యోగం అడగడానికి కాదు సర్, ఆ తరువాయి కథ చెబుదామని నాకు అభిమానముంది సర్..."

"ఏమిటా తరువాయి కథ?" నిరాసక్తంగానే అడిగాడు హేమంత్.

అహమ్మద్ నిలుచునే చెప్పసాగాడు.

చీకటి... నిర్జన ప్రదేశం... నన్ను వొదిలేసి మీరు వెళ్ళిపోయారు. వెనక్కి ఓ కిలోమీటరో రెండు కిలోమీటర్లో వెడితే తప్ప ఆ చీకటోళ్ళ గూడెం కూడా రాదు.

ఏ నేరానికీ శిక్ష? ప్రమాదం జరిగిందనేగా?

ప్రమాదం జరిగిన మాట నిజమే కాని... దానికి నేను కాని కారు కాని బాధ్యులం కాముని అంతరాత్మ చెబుతోంది. ఒక ప్రమాదానికి కారూ డ్రయివరూ మాత్రమే కాక మూడో మనిషి కూడా కారణం కావొచ్చు.

నేను కారులో ఉన్నా... ఆ గూడెంవాళ్ళ మాటలు నాకు వినపడుతూనే ఉన్నాయి కదా... అవి జ్ఞాపకం వొస్తూ... ఆలోచనలు రేకెత్తిస్తూ... అనుమానాలు కలిగిస్తూ..

అసంకల్పితంగానే నేనా చీకటిలో... ఒంటరిగా... ప్రమాదం జరిగిన స్థలంవేపు నడవసాగాను. ఎందుకో... ఆ ప్రమాదంలో నా బాధ్యత లేదనిపిస్తోంది. నేనా గుడిసెల వద్దకు చేరాను ఆలోచనలలోనే... నడిచి.

"ఎవరు?" ఎవరో అడిగారు.

"ఎవరంటే ఏ చెప్పేదీ?" అన్నాను. వాళ్ళకి నా గురించి ఏమని చెప్పగలను?

"ఎందుకొచ్చావ్?"

"ఏమో" నిజంగా నాకే తెలియదు కదా.

"మందు మీదున్నావా?" వేళాకోళం. కాని... మందనే మాట నాలో ఉత్సాహం రేపింది. ప్రస్తుత పరిస్థితిలో నాకు దాని అవసరం ఎంతయినా ఉంది. చేయని నేరం మోపబడీ, ఉద్యోగం వూడీ... మనసు చెదరి ఉన్నాను కదా?

"ఇప్పటికి లేను. ఉండాలనిపిస్తూంది. మందుందా?" ఆత్రంగా అడిగాను.

"గూడెంలో గుర్రాలక్కొదవా? డబ్బుండాలే కాని..." నవ్వాడతను.

"డబ్బుకి కొదవ లేదు. ఇద్దరికీ సరిపడిన దానికంటే ఎక్కువే ఉంది" అంటూ ఏభై నోటందించానో లేదో సారా ప్యాకెట్లు పట్టుకొచ్చి "అలా రోడ్డుపక్క తూమ్మీద కూసుందాం పద. సారా పాకలో అంతా

గోల. సారా పాకే ఏమిటిలే... గూడెమంతా గుర్రం మీదే ఉంది. సొమ్మందిందిగా" అప్పటికే అతను తాగి ఉన్నాడు.

"సొమ్మందడమేమిటి?" అడిగాను ఓ ప్యాకెట్ అతను తాగాక.

"ఇందాకా...ఓ కారోడు... పదేలిచ్చాడు... ఇచ్చాడంటే వుట్టి వున్నానికిచ్చేశాడేటి? మన తెలివితేట్లకి పడిపోయి..."

"ఏమిటా తెలివితేటలు?" ఇంకో ప్యాకెట్ కూడా అతను తాగాక అడిగాను. వయసు మళ్ళిన అతను నిషాకి నిగ్రహించుకోలేక యిట్టే నిజం కక్కేసే బలహీనుడిలా ఉన్నాడు. అపైన... అ సారా కూడా తక్కువ పవరుది కాదు. అతను కక్కిన మాటలు అతని భాషలోనే వినండి, అవసరమైన మేరకు చెబుతాను.

"తమ్ముడూ! బతకడమంత సులువు మరోట్నేదీ ప్రెపంచకంలో బతకడమంటే గొడ్డులా పన్జేస్తూ గెంజినీళ్లకి ముకం వాచుతూ ముష్టి బతుక్కాదు. చుక్కా ముక్కా తొక్కా అన్నీ అనుభవిస్తూ అప్పుడప్పుడేనా అనందిస్తూ రాజాలాటి రంగుల బతుకు. అదీ. ఎటొచ్చీ మనిసికి బుర్రుండాలి. కాస్త మాయుండాలి. నీకోటి తెల్సా? నేనీ గూడేనిగ్గురువుని. ఇక్కడీ గూడెం లేచి జనాలు సుకంగా బతుకున్నారంటే మనసలవే. మనది మా గట్టి బుర్రలే, మినిస్టరు కావల్సినోణ్ని..." చుట్టంటించి... "అమాయకప్పచ్చులు... పన్లుజేసి పొట్ట పోసించుకుందామనుకునే వాళ్లు. పన్లిచ్చే పరమాత్ముడే కరువు. పనిచ్చినా పొట్ట నింపని అర్ధ కూలి. అల్ల కష్టాల్చూడలేక నేనీళ్లనిక్కడికి దీసుకొచ్చి గుడిసె లేయించాను రోడ్రు పక్క బంజరు బూములూ... పోరంబోకులూ... ప్రెబుత్వమూ పట్టించుకోలేదు. రోడ్రుంది, రోడ్రు మీన నిముషానికీ నిముషానికీ అటూ యిటూ తుర్రుబుర్రుమంటూ తిరిగే కార్లూ లారీలూ, పిల్లలగ్గానీ కారాట నేర్పామో కేసులే కాసులు. కట్టలే కట్టలు. డబ్బే డబ్బు.

"కారాటేమిటి?" అడిగానర్థం కాక.

భొళ్లున నవ్వాడు గూడెం గురువు. "అ వేళ అట్నా యిలాగే అడిగారు. ఇది రాచబాట కదా? రోడ్రు మీద కార్లు తెగ పరుగెడుతూంటాయి కదా? వొచ్చేకారు నీ, వొడుపునీ చూసుకుని కారు కడ్డం పరుగెత్తి దెబ్బ తగిలించుకుంటాడు పిల్లడు.

మనం పెద్దోళ్లం, కారు నాపి చుట్టూ మూగిపోతాం. కుర్రాణ్ని తప్పించేసి- అడి ప్రాణం పోతుందన్నంత నాటకం ఆడతాం. గుడిశెలోంచి కుర్రాడు గోలగోల చేసేస్తూంటాడు. కారోళ్లు పైకలా గోటుగా కన్పడతారు గానీ వొట్టి పిరిగ్గొడ్లు. పోలీసులూ కేసులూ అంటే అల్లకీ బయమే. మనం అలాటి వాటి జోలికిపోకుండా- డబ్బులతో కేసు తీరుమానం చేసేసుకుంటాం..."

"ఒకవేళ కుర్రాడికి నిజంగా కాలో చెయ్యో విరిగితే?"

"కారు కదా...విరగదు. విరిగితే మరీ మంచిది. రేటు పెంచేస్తాం."

"పొరపాటున ప్రాణం పోతే?"

"ఇంకా మంచిది. మరీ రేటొస్తుంది. కాలిరిగితే పట్నంలో రోడ్డు పక్క ముష్టిక్కూర్చోబెడతాం అదీ ఆదాయమే. ప్రేణం కరీదు చచ్చుగా పదివేలు. కాని... ఎప్పుడో కాని కారుకింద పడినంత మాత్రాన కుర్రోడు చచ్చిపోడు. చస్తేయింక లేనిదేముంది? పండగే. విందే, మందే!" నవ్వాడు.

నేను నమ్మలేకపోయానతని మాటలని. "డబ్బు కోసమని కన్న బిడ్డల్ని కారుకిందకి తోల్తారా!"

"ప్రపంచకం నీకేటీ తెలిసినట్లు లేదు. ఒరిస్సాలో పది రూపాయల కోసమూ పట్టెడన్నం కోసమూ బాలింతలు పురిటి బిడ్డల నమ్ముకుంటున్నారు. అంటే అర్థమేమిటి? కడుపాకల్తరవాతే కన్న మమకారమనే కదా? ఐనా కన్నబిడ్డల్తోనే కారాటాడించమని నేనన్లేదే. షేకులు పిల్లన్ని కొని ఒంటెల పందాలూ ఒంటెలాటలూ ఆడించటం లేదూ?-"

తెల్లబోయి వింటున్నానతని మాటలని.

"మనమూ అంతే. పిల్లన్నెత్తుకొచ్చి...మచ్చికా మాలిమీ చేసుకుని... కారాట నేర్పి ముగ్గులోకి దింపుతాం. బరిలోకి... రోడ్డు మీదకి... వొదుల్తాం. లేచినవేళా గుడ్డే కారూ మంచిదయితే కనక వర్షమే. యిందాక? ఆ గుంటనాకొడుక్కి నిజంగా కాలిరగనూ లేదు ఏమీ కాలేదు. అంతా ఏక్షను. నలుగురమూ నాటకమాడి పదేలాడికేశాం. నీకూ యిలా బంగారం బతుకు బతకాలనుంటే ఎక్కడినుంచేనా ఓ పిల్లనో పిల్లాడినోఎత్తుకొచ్చీ. మిగిలిన సంగతినే చూస్తా."

నివ్వెరపోయి అడిగాను. "పిల్లలెక్కడ దొరుకుతారూ?"

"ఈ దేశంలో పిల్లల కొ్కదవేటి? టేషన్ కాడ... బస్టాండుల్లో... రోడ్ల మీద... కాలువగట్ల పక్క... ఎక్కడ చూసినా అమ్మానాన్నలేని అడుక్కు బతికే అనాద పిల్లలే. అలాటోళ్లని వేటాడి... జీళ్లో చేగోడీలో కొనిపెట్టి మంచి మాటలు చెప్పి మెల్లగా కొట్టు కొచ్చీడమే. సల్లగా పట్టుకొచ్చీడమే. నువ్వెక్కడో వెర్రాడిలా ఉన్నావు.ఇలా అయితే యీ మాయా ప్రపంచకంలో బతికి బట్టకట్టినట్లే."

నాకంతా ఆశ్చర్యంగానూ అయోమయంగానూ ఉంది.

పరిస్థితులెంత విషమించినా కష్టపడేవాడి కాపాటి కూడు దొరక్కపోదు. ఈ దేశం యింకా అంత చెడిపోలేదు. కాకపోతే... వీళ్లకి కావలసింది పొట్టకి కూడు కాదు. పలావులు! తాగడానికి గంజి కాదు సారాలూ విస్కీలూ. బతకడం కాదు విలాసంగా గడపడం.

అందుకే...

అలాటి రంగు బతుకుకోసమనే... వీళ్లు, ఎంతో దారుణంగానూ వికృతంగానూ ప్రవర్తిస్తున్నారన్న మాట! పసిపిల్లల బతుకులతో ఆటలాడి వాళ్ల మీద డబ్బు చేసుకునే అమానుషమూ నీచాతినీచమూ ఐన కారాటకు దిగజారుతున్నారు!

ఎటువంటి భయంకరమయిన సత్యం!

ఎంత నీచమైన నిజం!

నమ్మశక్యం గావడం లేదు.

"ఐతే... యిందాకా... ఆ కుర్రాడు... కారు ప్రమాదం..."

"ప్రమాదమేమిటి నా మొకం? కావాలని రోడ్డు కడ్డం తోలారు. అదురుష్టం బాగుండి... పదేలొచ్చే రాతా గీతా ఉంది. గుంటడు కారుకి తగిలాడు... కారు గుంటడికి గిరుకుంది..." నవ్వాడు.

"సరే నేను వొస్తాను..."

"ఇంతకీ నువ్వెవరివి? ఇంతసేపూ అడగడమే మరిచిపోయాను తాగుడులోపడి?"

"నేనా కారు డ్రయివర్ని. ఉరుమురిమి మంగలం మీద పడిందన్నట్లు మీరాటాడిన కారాట నా

ఉద్యోగం పీకి వొదిలింది. యజమాని ముందు నన్నో వెధవని చేసి వొదిలింది. నా నైపుణ్యానికి మచ్చ తెచ్చింది" అని అక్కడ నుంచి వచ్చేశాను.

విభ్రాంతుడై చూశాడు శ్రీమంత్. "నువ్వు చెప్పింది నిజమేనా?"

"అనుమానమయితే ఆరా తీయండి మీరే. నేను వచ్చింది ఆ ప్రమాదానికి కారణం నేను కాని నా నిర్లక్ష్యం కాని, నా అసమర్థత కాని కావని చెప్పడానికే. మీకు నిజం తెలియజేయాలనే. వస్తా... నమస్తే..." అని వెనుదిరిగాడు అహమ్మద్.

నివ్వెరపాటు నుంచి తేరుకోలేకపోతున్న శ్రీమంత్ "ఎంత దారుణం! పేదరికం బాల్యానందాన్నే కాక బాలల బతుకుల్నీ దోచుకుంటూందా యీ దేశంలో! ఎంత అన్యాయం" అనుకుంటూ భారంగా నిట్టూర్చాడు.

## కుక్క

నేను మనుషుల డాక్టర్నవ్వాలని ఎంతగానో ఆశపడేవాడిని. కానీ విధి వెక్కిరించి చివరికి పశువుల డాక్టర్నవవలసి వచ్చింది.

ఆ వేళ "మిమ్మల్నున్నపళాన వెంటబెట్టుకొచ్చీమన్నారు మా అయ్యగారు, కారులో" అంటూ ఊళ్లో అత్యంత ధనవంతులలో ఒకరైన అప్పారావ్‌గారి కారు డ్రైవరు. నాకు ఆలోచించుకుందుకేనా సందివ్వకుండా యజమాని ఇంటికి తీసుకెళ్లాడు కారులోకి తోసేసి.

మొదటినుంచీ నాకు తెలివితేటలు తక్కువ. అప్పుడు విద్యపట్ల ఎలా శ్రద్ధ వుండేది కాదో, ఉద్యోగంలో చేరాక వృత్తి పట్ల కూడా అలాగే అశ్రద్ధ. పశువులకి నోరూ, ఫిర్యాదు చేయగలిగే శక్తీ లేవు కనుక నా ఉద్యోగ జీవితం బాగానే వెళ్లిపోతూంది. నా మంచి పశువులే నాకు శ్రీరామరక్షగా నిలిచాయి.

కారు అప్పారావ్‌గారి భవనం ముందాగింది. డ్రైవు నన్ను అప్పారావ్‌గారి గదిలోకి తీసుకెళ్లాడు. అంత పెద్ద విశాలమైన గదిని గది అనడం అవమానించడమే అవుతుంది. హాలు, దర్బార్ అలాటి గొప్ప పదాలు వాడాలి. దానిలో కుర్చీ... అహ సింహాసనంలో ఒకాయన.

అయనే కాని అప్పారావుగారైతే వీరి రూపానికీ గాంభీర్యానికీ ఆ పేరు చాలా తక్కువైపోతుంది. కుర్చీలో వారు, వారి ఒడిలో ఓ కుక్క

నన్ను కూర్చోమని- "మీరేనా పశువైద్యులు?" అని అడిగారాయన.

చేతులు జోడిస్తూ ఔనన్నట్లు తలూపాను అచ్చం పశువులా.

"ఇది జూలియట్. జూలీ. గొప్పజాతి. అరుదైనది. ఇదంటే మాకెంతో ముద్దూ, ప్రాణమూ" అని కుక్కని పరిచయం చేస్తున్నట్లు వారలా అనేసరికి ఏం చేయాలో తోచక దానికి కూడా ఓ దణ్ణం పెట్టేసేవాడినే కాని సమయానికి దేముడడ్డం పడినట్లుంది.

"వెంటనే అబార్షన్ చేయాలి" అన్న మాటలు వినిపించి-